క్లుప్తంగా

నేటి నుంచి ఉత్సవాలు

మక్తల్: మండలంలోని జక్లేర్‌గ్రామంలో బీరప్ప ఉత్సవాల కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. బీరప్ప బండారు, ఎల్లమ్మ బండారు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల కోసారి కార్యక్రమం ఉంటుందని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభిషేకాలు..

అమరచింత: బీరప్ప దేవర్ల ఉత్సవాలను కురువ కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందే తమ కుల దేవర్లను భక్తిశ్రద్ధలతో పూజించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని సంఘం పెద్దలు వెల్లడించారు. ఆదివారం బీరప్ప స్వామి ఆలయంలో పూజలను నిర్వహించి దేవర్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో పూజారి గోపి, కుర్వ వీరేష్, రాము, కురుమన్న, రవి పాల్గొన్నారు.

ఆత్మకూర్: కురుమ కులస్తుల ఆరాధ్యదైవం బీరప్పస్వామి దేవర్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూర్, ఖానపూర్ గ్రామాలకు చెందిన కురుమలు తెల్లవారుజామున ఊరేగింపుగా కృష్ణానదికి వెళ్లి అక్కడ విగ్రహాలను శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మల్లేష్, చింతలన్న, కుర్వరవి, అనంతరాములు, సుధీర్, జీవేంద్రుడు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం



నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామంలో ఆదివారం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహాశివరాత్రిని పురస్కరించుకొని 108 మంది దంపతులచే శివపంచాక్షరి దీక్ష కార్యక్రమాన్ని అర్చకులు సుధీందర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోపూజ, ధ్వజారోహణం కార్యక్రమాల అనంతరం దీక్షను దంపతులు స్వీకరించారు. ఈ దీక్షలో భాగంగా ఈ నెల 17, 18 తేదీలలో గణపతి హోమము, మహాయజ్ఞం, శివపంచాక్షరీ సామూహిక పారాయణము, శివపార్వతుల కల్యాణముతో పాటు రాత్రికి పూర్ణాహుతి కార్యక్రమాలను చేపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యాంలాల్, ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ చైర్మెన్ హన్మంతురెడ్డి, పల్లెశేఖర్, రాఘవేందర్‌గౌడ్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అమరచింత: మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ డాక్టర్ మాలతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కంటివెలుగుపై అవగాహన...

ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11గంటలకు కంటివెలుగు కార్యక్రమంపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. అవగాహన కార్యక్రమం అనంతరం సర్వసభ్య సమావేశం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 'టాలెంట్ టెస్ట్'

దేవరకద్ర: మండల కేంద్రంలోని భవిత జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివే 324 మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజ్‌కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకటేశ్, శ్రీను, బుర్రన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

నారాయణపేట రూరల్: ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారు చేసుకోగలమని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మొల్గాన్ జనార్ధన్ అన్నారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయస్సు పెరుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు దరి చేరకుండా కాపాడుకునేందుకు క్రీడలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. నిత్యం ఆటలు, వ్యాయామం, యోగా కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. 35 నుంచి 60 మధ్య వయస్సు కలిగిన వివిధ విభాగాలకు రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు ఈనెల 21, 22న మెదక్‌లో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, అనంతసేనా, అమరేష్, సాయినాథ్, బాలరాజు, రత్నయ్య, వెంకటప్ప, శ్రీధర్, రాజశేఖర్, వేణుగోపాల్, చక్రవర్తి పాల్గొన్నారు.

మొక్కల పెంపకం షురూ..

- ఊపందుకున్న పనులు
- రాబోయే విడతలో 2.24లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- జూన్ నాటికి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్న అధికారులు

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా రాబోయే విడతకు సంబంధించిన పనులు మండలంలో ఊపందుకున్నాయి. 20 గ్రామ పంచాయతీల్లో ఉన్న 20 నర్సరీలలో మొత్తం 2.24 లక్షల మొక్కలను పెంచుతున్నారు. వచ్చే జూన్ నాటికి మొక్కలు అందిచేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. నూతన చట్టం ప్రకారం ప్రతీ గ్రామంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నర్సరీ ఉండాలి. ఈ చట్టంలో వన నర్సరీల్లో మొక్కల పెంపకం అంశాన్ని కూడా పొందుపర్చారు. 2023లో చేపట్టబోయే హరితహారం కార్యక్రమంలో ప్రతీ కుటుంబం ఆరు మొక్కలు నాటాలనే ఉద్దేశంతో మొక్కలు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా గత విడతలలో మిగిలిన మొక్కలను సంవత్సరం వాడుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ప్రతిరోజు నర్సరీలను తనిఖీ చేస్తున్నారు.



కిష్టాపూర్‌లో మొక్కలు పెంచుతున్న కూలీలు

> **జూన్ నాటికి మొక్కలు అందజేస్తాం**
>
> ధన్వాడ మండలంలో మొత్తం 2.24 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఏర్పాటు చేసుకున్నాం. ఈ మేరకు మొక్కలు పెంచే పనులను ప్రారంభించాం. జూన్ నాటికి మొక్కలు ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తాం. హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని గ్రామల ప్రజలు, ప్రజప్రతినిధులు, అధికారులు సహకారం అందిస్తే బాగుంటుంది.
>
> – సిద్దేశ్వర్, ఈజీఎస్ ఏపీఓ, ధన్వాడ

మొలకెత్తని వాటి స్థానంలో కొత్తవి నాటుతూ లక్ష్యాన్ని చేరుకునేందుకు సిద్ధం అవుతున్నారు. కాగా మండలంలోని గ్రామపంచాయతీలలో సరిపడా స్థలాలు లేకపోవడంతో వైకుంఠధామాలను ఉపయోగించుకుంటున్నారు. మండలంలోని కిష్టాపూర్, దుదుగుతండా, ఎమ్మోనొనిపల్లి గ్రామాలలో నిర్మించిన వైకుంఠధామాలో నర్సరీలను ఏర్పాటు చేశారు.

ఓపెన్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



మరికల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కుమార్

మరికల్ : బడి మానేసి ఇతర పనులు చేసుకుంటున్న వారు తమ ఉన్నత లక్ష్యాల కోసం ఓపెన్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ ఇంటర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కుమార్ అన్నారు. మరికల్‌లో ఆదివారం వెంకటసాయి పాఠశాలలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యను మధ్యలో నిలిపివేసిన గృహిణులు, వ్యాపారులు, చిరు ఉద్యోగులు ఓపెన్ స్కూల్ కల్పించిన పదవ తరగతి, ఇంటర్ విద్య ద్వారా కలను సాకారం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఓపెన్ స్కూల్ తరగతులకు వస్తున్న విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సెంటర్ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, జ్యోతి, రామలింగం, కిషోర్, బాగ్యారేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవమ్మ పూజ



కృష్ణా: మండలంలోని కున్సి గ్రామంలో ఆదివారం దేవమ్మదేవి విగ్రహాలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడెచూర్ పీఠాధిపతి శ్రీ గురుమూర్తి శివాచార్య మహాస్వామి, చేగుంట క్షీరలింగా మహాస్వాములు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. విగ్రహాలను ప్రతిష్ఠించి మూడేళ్లు కావడంతో పూజ కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇందులో అర్చకులు మంజునాథ్ స్వామి, అభిస్వామి, గ్రామస్తులు సోమశేఖర్‌గౌడ్, ధర్మరాయ, నర్సప్ప, శరణప్పగౌడ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

ఊట్కూరు: ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీ షెడ్యూల్ విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి కోరారు. ఊట్కూరులో ఆదివారం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు భాస్కర్, రఘువీర్, శ్రీనివాస్, ఆనంద్ కుమార్, శ్రీవిద్య, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పంచాయతీ భవనానికి నిధులివ్వండి

మరికల్: మండలంలో కొత్తగా ఏర్పడిన పల్లెగడ్డ గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు హన్మంతు, రాములు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయితీలతో పాటు పాత పంచాయితీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన అధికారులు పల్లెగడ్డను ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రశ్నించారు. 1500 జనాభా, 750మంది ఓటర్లు ఉన్న తమ గ్రామానికి నూతన పంచాయితీ భవనం లేక పాఠశాల గదిలో కొనసాగిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య తగదు

ధరూరు: గ్రామాలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వామన్‌పల్లిలో పల్లె నిద్ర చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలోని కాలనీల్లో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సొంత ఖర్చులతో వివిధ పనులు చేసినా బిల్లులు రావడం లేదని సర్పంచు విన్నవించారు. గ్రామ పంచాయతీకి సొంత భవనం లేదని వివరించారు. ఏకగ్రీవంగా ఎన్నికై నప్పటికీ రూ.25లక్షల ప్రభుత్వ ప్రోత్సాహం అందలేదన్నారు.అనంతరం రంజిత్‌కుమార్ మాట్లాడుతూ డ్రెయినేజీలు లేక మురుగురోడ్లపైనే పారుతుందన్నారు.

11న రెవెన్యూ సదస్సు

కృష్ణా: మండలంలోని చేగుంట గ్రామంలో 11న గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ పంచాయతీ పరిధిలో మిగిలిపోయిన భూ సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు భూ సంబంధ సమస్యలు ఏవైనా ఉంటే సదస్సులో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'వైఎస్సార్ టీపీని బలోపేతం చేద్దాం'

నారాయణపేట టౌన్ : డా.వైఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన పలు సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ, వైఎస్సార్ టీపీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మడివాల్ కృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ టీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ కపట ప్రేమ చూపిస్తూ రైతులు, ఇతర వర్గాల మీద బూటకపు వాగ్దానాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ షర్మిల అడుగుజాడల్లో కార్యకర్తలు నడవాలన్నారు. పార్టీబలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. యువత అధ్యక్షుడు అరుణ్‌గౌడ్, మైనార్టీ జిల్లా నాయకులు సలీం, మండల నాయకుడు హనీఫ్, అబ్దుల్, వడ్డేప్ప, రాథోడ్, నారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



అవుసలోనిపల్లిలో బహుమతులను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మక్తల్ పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానంలో వివిధ క్రీడా పోటీలను ప్రారంభించారు. అంతకుముందు స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పించారు. మక్తల్ ఎస్ఐ పర్వతాలు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య వివేకానందుడి సేవలు మరువలేమన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. నగర అధ్యక్షుడు అంజిరెడ్డి, వంశీ, కర్నిస్వామి, విజయ్‌కుమార్, కావాలి వెంకటేష్, మంజూనాథ్, రాజుగౌడ్, రఘుప్రసన్నబట్, రాఘవేందర్‌రావు, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని పంచదేవ్‌పాడు గ్రామంలో ఆదివారం ఉర్సు సందర్భంగా గ్రామానికి చెందిన నర్సింహాచారీ జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆనంద్‌చారీ, సంతోష్‌చారీల సహకారంతో ఎంపీపీ వనజ, సర్పంచ్ కల్పనలు కబడ్డీ పోటీలను ఆదివారం ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.16 వేలు, రెండవ బహుమతి రూ.5,016, తృతీయ బహుమతిగా 3,016 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ తిప్పమ్మ, కృష్ణయ్య, రాములు, మంజునాథ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని వీజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం అవుసలోనిపల్లి గ్రామంలో వీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ రంగంలో రాణిస్తున్న గొప్పగొప్ప క్రీడాకారులు గ్రామస్థాయి నుంచే ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. క్రీడాకారులకు ఎల్లప్పుడు తాను వెన్నంటి ఉంటానని తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన అవుసలోనిపల్లి టీంకు మొదటి బహుమతి, జాయాపూర్ టీం ద్వితీయ బహుమతులుగా నగదుతో పాటు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఆయనను సన్మానించారు. నాయకులు మహబూబ్, ఆహ్మద్‌టేలర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దామరగిద్ద: గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ఎంచదేవ్‌పాడు వారిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పల్లె ప్రగతి క్రీడలను నిర్వహిస్తోందని ఎంపీటీసీ బస్వరాజ్, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో పల్లె ప్రగతి క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు పోటీలలో పాల్గొనాలని కోరారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల పీఈటీలు వెంకటప్ప, రామకృష్ణ, కతలప్ప, రమేష్, క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కాన్‌కుర్తిలో బహుమతుల ప్రదానం



పంచదేవ్‌పాడులో..



మక్తల్ పట్టణంలో..

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

నారాయణపేట టౌన్ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరుగుతున్న కార్మిక కర్షక ఐక్యత సదస్సుకు జిల్లా కేంద్రం నుంచి ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకున్న కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను అమలు చేసే కుట్ర చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కార్మిక, ప్రజా వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటానికి పిలుపునిచ్చారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం కార్యదర్శి అంజిలయ్యగౌడ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం, కో–కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు భీమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ రాష్ట్ర నాయకులు కాశీనాథ్, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు సాయిలు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, మార్పెప్ప తదితరులు ఉన్నారు.



సదస్సుకు తరలుతున్న నాయకులు

విద్యుత్ సిబ్బంది ఇష్టారాజ్యం!

మాగనూర్: మండలంలోని విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతినెల కరెంట్ బిల్లులు సక్రమంగా తీయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. ప్రతి నెల 30 రోజులకు రావాల్సిన విద్యుత్ బిల్లులు సందర్భం లేకుండా అయితే 25 రోజులు, లేకుంటే 34 రోజులు అంతకంటే ఎక్కువకు తీస్తున్నారని తద్వారా తాము నష్టపోతున్నామని వినియోగదారులు అంటున్నారు. వివరాల ప్రకారం.. ఓ వినియోగదారుడికి డిసెంబర్‌లో 27 రోజులకు 650 బిల్లు వచ్చింది. మళ్లీ జనవరి 34 రోజులకు రూ. 1359 బిల్లు అదే మీటర్‌కు వచ్చిందని అంటున్నారు. కాగా ఎక్కువ రోజులకు బిల్లు తీసినపుడు యూనిట్ల పరిధి మారుతుందని తద్వారా ప్రతి యూనిట్‌కు అదనపు భారం పడుతుందని బిల్లు ఎక్కువగా వస్తుందని వాపోతున్నారు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి విషయాలపై వాట్సప్‌లోనూ మెసేజ్‌లు చక్కర్లు కొడుతున్నాయని చెబుతున్నారు. సక్రమంగా బిల్లులు తీస్తే ఇలాంటి సమస్యలు రావంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు బిల్లులు సక్రమంగా తీసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవానికి మంత్రి రాక

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన ప్రారంభోత్సవానికి 11న ముఖ్య అతిథులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ సరిత నివాసంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించి పలువిషయాలు వెల్లడించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనున్నట్లు వివరించారు. మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాకిటి శ్రీనివాసులు, రైతు సమితి నాయకులు మధుసుదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి


మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట రూరల్ : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని శ్రీసత్యనారాయణచౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కారాదని, తమ కెరియర్‌పై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి వాటిని విడనాడాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే ఫైన్ కట్టాల్సి వస్తుందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలని, అవి ప్రాణాలను కాపాడుతాయన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు.

పెద్దచింతకుంటలో కోడిపందేలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో నెలరోజుల నుంచి జోరుగా కోడి పందేల పోటీలు జరుగుతున్నాయి. గత నెలల్లో పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి పందేలు ఆడుతున్న వారిని, ఆడిస్తున్నవారిని పట్టుకున్నారు. కాగా పందేలకు అలవాటు పడ్డవారు మళ్లీ ప్రారంభించారని పలువురు ఆరోపిస్తున్నారు. శివారులోని ముళ్లపొదల్లో కూడా కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఈ పోటీలకు మండలంతో పాటు ఇతర ప్రాంతాల వారు తరలివస్తున్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో భారీమొత్తంలో నగదు చేతులు మారుతోందని తెలుస్తోంది. పోలీసులు పట్టుకునేందుకు అవకాశం ఉండడంతో గ్రామ స్టేజీ వద్ద నిర్వాహకులు కొందరు వ్యక్తులను నిఘా పెట్టేందుకు ఉంచుతున్నారని, నిత్యం సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పందేలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్రాంతికి కబడ్డీ టోర్నమెంట్

నర్వ: మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 14, 15 తేదీలలో ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ యువజన సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ. 15016, తృతీయ రూ. 10,016, చతుర్థ బహుమతి రూ. 5016 లను విజేతలకు అందజేస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొనే జట్లు ముందుగా ఎంట్రీ చేయించుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్తాచాటాలని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అల్లుకున్న నిర్లక్ష్యం

నారాయణపేట టౌన్ : పట్టణంలోని టీచర్స్ కాలనీ, శ్యాసన్‌పల్లి రహదారిలో కరెంట్ స్తంభాలకు తీగజాతీ మొక్కలు అల్లుకుపోయాయి. దీంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీగజాతి మొక్కలు ఏపుగా పెరగడంతో వీధిలైట్ల వెలుతురు సైతం సక్రమంగా పడటం లేదని వాపోతున్నారు. అదేవిధంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు కనీసం మరమ్మతులు చేయడానికైనా సిబ్బంది వాటి దగ్గరకు వెళ్లలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి పెరిగిన తీగజాతి మొక్కలను తొలగించి విద్యుత్ అంతరాయం సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

